క్లుప్తంగా

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

చాపాడు : మైదుకూరు నియోజకవర్గ ముస్లీం సోదరులందరికీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగను నిర్వహించుకోవాలని, అందరికీ మంచి జరగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

రేపు వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధిలోని చిన్నగురువళూరు గ్రామంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డా.కావ్యమాధురి తెలిపారు. గ్రామంలో హెల్త్ క్లినిక్ వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ వైద్య శిబిరం ఏర్పాటు చేసి నలుగురు ప్రత్యేక వైద్య నిపుణులచే అన్ని రకాలైన వైద్య పరీక్షలు చేయించి అవసరమైన మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని గ్రామ సచివాలయ పరిధిలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

టోఫెల్ పరీక్షల పరిశీలన



టోఫెల్ పరీక్షలను పరిశీలిస్తున్న ఆర్జేడీ రాఘవరెడ్డి

మైదుకూరు : మైదుకూరులో బుధవారం ప్రారంభమైన టోఫెల్ (టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్ యాజ్ ఏ ఫారిన్ లాంగ్వేజ్) పరీక్షలను ఆర్జేడీ వై.రాఘవరెడ్డి పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల విద్యార్థుల్లో ఇంగ్లీషు ప్రావీణ్యతను పరీక్షించేందుకు ఈ టోఫెల్ పరీక్ష నిర్వహిస్తున్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో జరుగుతున్న టోఫెల్ పరీక్షలను పరిశీలించిన ఆర్జేడీ రాఘవరెడ్డి పరీక్షల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్జేడీ వెంట ఎంఈఓ పద్మలత, పాఠశాల హెడ్మాస్టర్ రమాదేవి ఉన్నారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కలసపాడు : స్థానిక గిద్దలూరురోడ్డులో ఉన్న మసీదులో కలసపాడు ముస్లింలకు బుధవారం వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అంకన గురివిరెడ్డి, సూదా రామకృష్ణారెడ్డి, సుదర్శన్, నారాయణయాదవ్‌ల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. నమాజ్ చేసి ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లిం సోదరులతో ఉపవాస దీక్ష విరమించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తంరెడ్డి, చిత్తారాజశేఖర్ రెడ్డి, పులి వీరారెడ్డి, రాంబాబు, కో ఆప్షన్ మెంబర్ మహబూబ్‌బాష పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పించాలి

బద్వేలు అర్బన్ : వేసవి ఉష్ణోగ్రతలు అధికమైన నేపథ్యంలో ప్రజలకు, ఉపాధి కూలీలకు వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.నాగరాజు పేర్కొన్నారు. బుధవారం తొట్టిగారిపల్లె పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన వైద్యులకు, వైద్య సిబ్బందికి సూచనలిచ్చారు. విలేజ్ హెల్త్‌క్లినిక్, ఆరోగ్య కార్యకర్తల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే హైరిస్క్ గర్భవతులను గుర్తించి వారికి సరైన సమయంలో వైద్యసేవలు అందిస్తూ మాతాశిశుమరణాలను అరికట్టేందుకు కృషి చేయాలని కోరారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మల్లేష్, జిల్లా ఎపిడిమాలజిస్టు ఖాజావుద్దీన్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వెంకటరెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌమ్య పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూం పరిశీలన



సీబీఐటీలో స్ట్రాంగ్ రూం వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

చాపాడు: సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మైదుకూరు నియోజకవర్గ పరిధిలో జరిగే పోలింగ్ కోసం అవసరమైన మెటీరియల్‌ను భద్రపరిచేందుకు స్థానిక చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)లో స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు బుధవారం సీబీఐటీలో స్ట్రాంగ్ రూంను కడప కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్, మైదుకూరు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ చంద్రమోహన్ పరిశీలించారు. గట్టి భద్రతా చర్యలు చేపట్టాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ యంత్రాంగానికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వై.భూషణం, వీఆర్ఓ ఇస్మాయిల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల ఉస్మాన్ అలీ మదరసాలో బుధవారం ఎమ్మెల్సీ గోవిందరెడ్డి 500 మందికి, రంగసముద్రం పంచాయతీలో 80 మందికి రంజాన్ తోఫా అందచేశారు. రంజాన్ పండుగకు కావాల్సిన నిత్యావసరవస్తువులు, బియ్యం ముస్లిం మహిళలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ ఎంతో పవిత్రమైన మాసమని, ఈ పండుగను ఆనందంగా, భక్తిప్రపత్తులతో, సంతోషంగా ఇంటిల్లిపాదీ జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అందరికీ ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సియం బాష, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీవ్‌బాష, ఎంపీటీసీలు ఇస్సాక్, గురప్ప, ముర్తుజనాయుడు, దాదాపీర్, మాజీ ఉపసర్పంచ్ రాళ్లపల్లె నరసింహులు, పార్టీ నాయకులు రవిచంద్రారెడ్డి, పుల్లారెడ్డి, నారాయణరెడ్డి ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



కాశినాయన : నరసాపురంలో ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న హనుమంతరెడ్డి

కాశినాయన : మండలంలోని నరసాపురం గ్రామంలోని నిరుపేద ముస్లింలకు రంజాన్ పండుగను పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి ఆధ్వర్యంలో జేసీఎస్ కన్వీనర్ గుండం హనుమంతరెడ్డి ముస్లింలకు రంజాన్ పండుగకు కావాల్సిన నిత్యావసర వస్తువులు, బియ్యం ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, టీచర్ షరీఫ్, గఫూర్, ఇమామ్‌మొహిద్దీన్, ఆదాబాష, షరీఫ్, మైనిద్దీన్, పీరావలి, ఖాదర్‌బాష, మహబూబ్‌బాష, వెంకటేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, రవికుమార్ పాల్గొన్నారు.



పోరుమామిళ్ల: రంజాన్ తోఫా ఇస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

మసీదులు ముస్తాబు



విద్యుత్ దీపాలంకరణలో జామియా మసీదు

ముస్లింలు పవిత్ర రంజాన్ పండుగను గురువారం ఘనంగా నిర్వహించుకోనున్నారు. రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని మక్కా సమీదు, జామియా మసీదు, మట్టి మసీదులతోపాటు పలు ప్రాంతాల్లోని మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కొర్రపాడు రోడ్డులోని ఈద్గా మైదానంలో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఇందు కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. చలువపందిళ్లు, తాగునీటి సౌకర్యం కల్పించారు. – ప్రొద్దుటూరు కల్చరల్

ఎదుటివారిపై బురదచల్లి లబ్ధి పొందడమే వరద వ్యూహం

మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : ఎదుటివారిపై బురదచల్లి లబ్ధి పొందడమే టీడీపీ అభ్యర్థి వరదరాజులరెడ్డి వ్యూహమని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ఎంవీ రమణారెడ్డి దౌర్జన్యపరుడని, ఖూనికోరుడని ప్రచారం చేసి లబ్ధి పొందిన వరద మళ్లీ ఆయన మద్దతుతోనే గతంలో ఎన్నికల్లో ప్రచారం చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డిని దూషించి మళ్లీ మద్దతు తీసుకున్నారన్నారు. వీఎస్ ముక్తియార్, ఈవీ సుధాకర్‌రెడ్డిలను అలానే వాడుకుంటున్నారన్నారు. పాతికేళ్ల ఎమ్మెల్యేగా ఉన్న వరద అభివృద్ధి నిరోధకుడుగా ముద్రపడ్డారని, ఇప్పుడు మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాడన్నారు. భవిష్యత్తులో మళ్లీ పోటీ చేయాలనే నాయకులకు అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉంటుందని, వచ్చే ఎన్నికల నాటికి 91 ఏళ్ల వయసు దాటిన వరద ఏమి చేయగలరని ప్రశ్నించారు.

వరద తన స్వగ్రామాలైన కామనూరు, రాధానగర్‌లో ఏ రోజు అయినా ఎన్నికల పోలింగ్ జరిపించారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి నాలుగు రోజుల క్రితం ఆర్యవైశ్యులతో సమావేశం నిర్వహించి అన్ని విషయాలను చర్చించారన్నారు. అదే తరహాలో వరద తన అల్లుడు రామచంద్రారెడ్డి, కుమారుడు కొండారెడ్డిలను పక్కన కూర్చొబెట్టుకుని ఆర్యవైశ్యులతో సమావేశం నిర్వహిస్తే బాగుంటుందని తెలిపారు. ఎస్ఎస్ మాల్‌లో పెట్టుబడి పెట్టిన వారు రుణభారంతో ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. అల్లుడు, కొడుకు చెల్లించాల్సిన అప్పుల గురించి ఎవరైనా ఇంటి వద్దకు వస్తే తనకు సంబంధం లేదని వరద చెప్పడం ఆనవాయితీగా మారిందన్నారు. చెన్నమరాజుపల్లె నడిపెన్న, ఆయన సోదరుడి కుమారుడిని ఎవరు చంపించారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిపై గతంలో హత్యాయత్నం చేయించింది ఎవరో చెప్పాలన్నారు.

ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ మాట్లాడుతూ సోములవారిపల్లె పంచాయతీ అభివృద్ధి గురించి ఏనాడు వరద పట్టించుకోలేదన్నారు. కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి భూ కబ్జాలు, సెటిల్‌మెంట్లు చేసి అక్రమ ఆస్తులను సంపాదించారన్నారు. కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి మాట్లాడుతూ టీడీపీ నాయకుడు ఈవీ సుధాకర్‌రెడ్డి మాట్లాడిన మాటలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఈవీపై వరద కుమారుడు కొండారెడ్డి దాడి చేసినప్పుడు ఎమ్మెల్యే రాచమల్లు అండగా నిలిచారన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ రమణయ్య పాల్గొన్నారు.

ఘనంగా మున్సిపల్ వైస్ చైర్మన్ జన్మదిన వేడుకలు

ప్రొద్దుటూరు : మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు పూలమాల వేసి, శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు వచ్చి ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు.

ఘనంగా దేవర మహోత్సవం



ప్రొద్దుటూరు కల్చరల్: పెద్దమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక రామేశ్వరంలోని శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో బుధవారం పెద్దమ్మతల్లి దేవర(ముద్ద) మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున చేరుకుని బోనాలు సమర్పించడంతో పాటు కోళ్ల, మేకపోతులు బలి ఇచ్చి తమ మొక్కులను తీర్చుకున్నారు. మండలంలోని కామనూరు అంకాలమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. ఉగాది మరుసటి రోజు అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీ. గ్రామస్తులతో పాటు, పరిసర ప్రాంత భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతి ఉత్సవం



జ్యోతులను తలమీద ఉంచుకుని నృత్యం చేస్తున్న భక్తులు

స్థానిక ఆర్టీపీపీ రోడ్డులోని శ్రీ అష్టభుజి మహాచౌడేశ్వరిదేవి ఆలయంలో ఉగాది పర్వదిన సందర్భంగా జ్యోతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి ప్రారంభమైన ఈ ఉత్సవాలు బుధవారం ఉదయం వరకు కొనసాగాయి. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పాణ్యం చిన్న సుబ్బరాయుడు, సురేంద్ర, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు రాజీనామా

మైదుకూరు : పట్టణంలోని 14వ వార్డుకు చెందిన 14 మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియాకు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్న తమను అవమానపరుస్తూ పింఛన్ పంపిణీకి దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్లే తాము రాజీనామా చేశామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి సీఎం అయ్యేందుకు కృషి చేయాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్ఆర్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

మైదుకూరు : మైదుకూరు మండలం మిట్టమానుపల్లెలో టీడీపీ నుంచి పలు కుటుంబాలు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సమక్షంలో బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీలో చేరాయి. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గ్రామానికి చెందిన అరికోటం నారాయణ, అరికోటం గోపాల్, అరికోటం ఓబులేసు, ఎర్రగొల్ల సుబ్బరాయుడు, జొల్లు కృష్ణయ్య , అరికోటం నరసింహులు తదితరులకు పార్టీ కండువాలను వేసి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, తోట శ్రీనివాసులు, ఎంఎస్ వెంకోజీరావు, అనుగొండ పెద్ద ఓబులేసు పాల్గొన్నారు.

కూలి మృతిపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ

ప్రొద్దుటూరు కల్చరల్ : కూలి పనికి వెళ్లి మృతి చెందిన పెద్ద ఓబులేసు మృతిపై పోలీసులు సమగ్ర విచారణ జరపాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాగలమర్రి మండలం నగళ్లపాడు గ్రామానికి చెందిన పెద్ద ఓబులేసు ఈనెల 4న రాజుపాళెం మండలం కూలూరు వద్ద మట్టి తోలడానికి వచ్చాడన్నారు. అర్ధరాత్రి ప్రాంతంలో సమయం ఉండటంతో నిద్రపోయిన పెద్ద ఓబులేసును ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడన్నారు. చికిత్స కోసం అతనని ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారని, అక్కడ చికిత్స పొందుతూ పెద్ద ఓబులేసు మృతి చెందాడని చెప్పారు. ఆయన మృతిపై అనుమానాలు ఉన్నాయని, విచారణ జరిపి వాస్తవాలు తెలపాలని డీఎస్పీకి విన్నవించామని చెప్పారు. బాధితుని కుటుంబానికి న్యాయం చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బాలలక్షుమయ్య మాదిగ, డప్పు చర్మకారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం మాదిగ, బాల ఓబన్న, తిరుపాల్, భాస్కర్ పాల్గొన్నారు.

మనిషిని సన్మార్గంలో నడిపించడమే రంజాన్ గొప్పదనం

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజద్ బాష



ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ప్రార్థనలు చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: మనుషులను సన్మార్గంలో నడిపించడమే రంజాన్ పండుగ గొప్పదనమని ఉపముఖ్యమంత్రి ఎస్‌బి.అంజద్‌బాషా అన్నారు. స్థానిక 10వ డివిజన్ ఎన్‌జీవో కాలనీలోని బిలాల్ మసీదులో కార్పొరేటర్ మల్లికార్జున ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం ప్రత్యేక ప్రార్థనలు చేసి ఉపవాస దీక్షలు విరమించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందు ప్రజల మధ్య సోదరభావం, ఆత్మీయతలను పరిమళింపజేస్తాయన్నారు. ఈ మాసంలో ప్రతి ఒక్కరూ విశ్వశాంతి కోసం అల్లాహ్‌ను ప్రార్థిస్తారన్నారు. సర్వమతాల సారం ఒక్కటేనని, ఉపవాస దీక్షలు మనుషుల్లో ప్రేమ, సోదరభావం, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు వ్యవస్థాపకులు జాఫర్ హుస్సేన్, అధ్యక్షుడు ఇబ్రహీం, మత పెద్దలు రహంతుల్లా, పీర్‌బాషా, దస్తగిరి, సందానీ, రాయల్ బాబు పాల్గొన్నారు.